క్లుప్తంగా

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుధాకర్‌రెడ్డి



పీలేరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుధాకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న వై. వెంకట్‌రెడ్డి పదవీ విరమణ చెందారు. కడప ప్రభుత్వ జూనియర్ బాలుర జూనియర్ కళాశాలలో భౌతిక శాస్త్ర అధ్యాపకులుగా పని చేస్తున్న సుధాకర్‌రెడ్డి పదోన్నతిపై పీలేరుకు వచ్చారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలి

మదనపల్లె సిటీ: పదో తరగతి విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఫిజికల్‌సైన్సు ఫోరమ్స్ టీచర్స్ నాయకులు భాస్కరన్ తెలిపారు. సోమవారం మదనపల్లె క్రిష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫిజిక్ స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. పదో తరగతి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా స్టడీ మెటీరియల్‌ను తయారు చేశామన్నారు. విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సైన్సుఫోరం నాయకులు శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్టవద్ద నున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో సోమవారం క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ప్రతి నెలా క్షయవ్యాధిగ్రస్తులకు ఉచితంగా నిత్యావసర సరుకులు అందజేస్తున్ననట్లు వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులు మందులు తీసుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని అందుకే ఈ కార్యక్రమంకు శ్రీకారం చుట్టామన్నారు. క్షయ వ్యాధి లక్షణాలు ఉంటే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేసుకోవాలన్నారు. ఆరు నెలలు పాటు మందులు వాడితే జబ్బు నయం అవుతుందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, టీబీ సిబ్బంది ప్రభాకర్, శాంతి,సుశీల, సునీత, వనజకుమారి పాల్గొన్నారు.


రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభ



విద్యార్థులతో కరస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి తదితరులు

మదనపల్లె రూరల్ : ఏపీ రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా డోన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో మదనపల్లె విద్యార్థులు ప్రతిభ కనపరిచి ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో రన్నర్స్‌గా నిలిచారు. ఉమెన్స్ డబుల్ టచ్ టీం రిలేలో రాష్ట్రస్థాయి విన్నర్స్, మెన్స్ డబుల్ అండర్ టీం రిలేలో విన్నర్స్‌గా నిలిచారు. స్పీడ్ స్ప్రింట్ మెన్, ఉమెన్‌లో 7 గోల్డ్ మెడల్స్, 4 సిల్వర్ మెడల్స్ సాధించారు. దీంతో ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో మదనపల్లె విద్యార్థులు ప్రతిభ కనపరిస్తే, అందులో శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉన్నారని కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా నిర్వహించిన ఎంపికలో ఏపీ రోప్ స్కిప్పింగ్ రాష్ట్ర జట్టుకు 8మంది ఎంపిక కాగా, వీరిలో ఒక అబ్బాయి, 7 మంది బాలికలు జట్టుకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర జట్టు వచ్చే నెలలో ముంబైలో జరిగే జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాపోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సురభి రమాదేవి, పీడీ శరత్‌నాయక్, జగదీష్ అభినందించారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం




కేవీపల్లె : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గర్నిమిట్టలో గణనాథుడి ఊరేగింపు, నిమజ్జనం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గర్నిమిట్ట గ్రామంలో ఆరు రోజుల క్రితం వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం గణేస్ విగ్రహాన్ని చాందిని బండిపై అలంకరించి గ్రామంలో ఘనంగా ఊరేగించారు. భక్తులకు గణనాథుడికి మంగళహారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం గ్రామ సమీపంలో ఉన్న చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైస్ సర్పంచ్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం: మండల కేంద్రంలోని బలిజవీధి, ఊలపాడు హరిజనవాడ తదితర గ్రామాల్లో సోమవారం వినాయకుడి నిమజ్జనాలు ఘనంగా చేశారు. వినాయక చవితి సందర్భంగా 6వ రోజు పలు గ్రామాల్లో వినాయకుని నిమజ్జనాలను యువకులు ఉత్సాహంగా, ఉల్లాసంగా, రంగులు చల్లుకుంటూ బళ్లారి డ్రమ్ములు, మేళ తాళాలు, సాంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదానం చేశారు.

అభివృద్ధికి చిరునామా వైఎస్సార్



వైఎస్సార్ హయాంలో గుర్రంకొండలో పట్టణంగా నిర్మించిన 630 ఇందిరమ్మ ఇళ్లు



రైతులకు సాగునీరు అందిస్తున్న అడవిపల్లి రిజర్వాయర్

జలయజ్ఞ ప్రదాత మహానేత దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్‌రాజశేఖర్ రెడ్డి చొరవతో పీలేరు నియోజకవర్గంలో ప్రజలకు, రైతులకు సాగు, తాగునీరు అందించే ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారు. రూ. 265 కోట్లతో సాగు, తాగునీరు ప్రాజెక్టులు, సమ్మర్ స్టోరేజి ట్యాంకులను నిర్మించారు. గుర్రంకొండలో రూ. 3 కోట్లతో మార్కెట్‌యార్డు నిర్మించారు. అలాగే ఒకేసారి రూ. 42 కోట్ల మేరకు నియోజకవర్గంలోని రైతులకు రుణమాఫీ చేసి ఘనత ఆయనకే దక్కింది. 20,400 ఇందిరమ్మ నియోజకవర్గానికి మంజూరు చేశారు. 26250 మందికి పింఛన్లను పంపిణీ చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. గుర్రంకొండలో రూ. 6.2 కోట్లు, వాల్మీకీపురంలో రూ. 7.8కోట్లు, కలికిరిలో 8.4కోట్లు, కలకడలో రూ. 4.6కోట్లు, కేవిపల్లెలో రూ. 4.8 కోట్లు, పీలేరులో రూ. 12కోట్లు మొత్తం రూ. 43.80 కోట్ల మేరకు రుణాలు, కరెంటు చార్జీలను మాఫీ చేశారు.

– గుర్రంకొండ



గుర్రంకొండలో రూ. 3 కోట్లతో నిర్మించిన మార్కెట్‌యార్డు



వాల్మీకిపురం ప్రజల దాహార్తి తీర్చడానికి నిర్మించిన భోగంపల్లె రిజర్వాయర్



కలికిరిలో 1000 ఇళ్లతో ఏర్పాటైన ఆధునిక ఇందిరమ్మ కాలనీ



కలకడలో వైఎస్‌ఆర్ హయాంలో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల

రాయితీ గడ్డివిత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

కలికిరి: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచిన రాయితీ గడ్డి విత్తనాలను అవసరమైన రైతులు తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని కలికిరి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డా. వెంకటముని నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని మర్రికుంటపల్లి, మేడికుర్తి, గుండ్లూరు, పత్తేగడ ఆర్ఎస్‌కేలలో రాయితీ గడ్డి విత్తనాలను రైతులకు అందచేశారు. అవసరమైన రైతులు ఆధార్, పట్టాదారు పుస్తకము, రేషన్ కార్డుతో ఆర్ఎస్‌కేలలో సంప్రదించి మొక్కజోన్న ఐదు కిలోలు రూ.85, జొన్నలు రూ.115, అలసంద మూడు కిలోలు రూ.74కు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పెరటితోటల పెంపకంపై రైతులు ఆసక్తి చూపాలి



పెరటితోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి

పీలేరురూరల్ : పెరటితోటల పెంపకంపై మహిళా రైతులు ఆసక్తి చూపాలని ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఒంటిల్లులో పెరటితోటల పెంపకంపై మహిళా రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగుల మందుల వాడకం లేని, కలుషితం కాని ఆరోగ్యకరమైన ఆహారాన్ని కుటుంబ సభ్యులందరూ పెరటి తోటల ద్వారా పొందవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా పెరటితోటలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ బీటీఎం జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ మంజూరు చేయించండి సార్

– పీజీఆర్‌ఎస్‌లో డీఏఓకు బాధితురాలి ఫిర్యాదు



సబ్ కలెక్టరేట్‌లో డీఏఓకు అర్జీలు సమర్పిస్తున్న బాధితులు

మదనపల్లె రూరల్ : రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయి, తీవ్రంగా గాయపడి అంగవైకల్యంతో బాధపడుతున్న తనకు పీహెచ్‌సీ పెన్షన్ మంజూరుచేసి పుణ్యం కట్టుకోవాలని మదనపల్లె పట్టణం ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన షేక్ షాహినా అర్జీ సమర్పించింది. రాజంపేటలో సీఎం పర్యటన సందర్భంగా సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దుచేశారు. అయితే, దీనిపై ప్రజలకు సమాచారం లేకపోవడంతో సుమారు 50 మంది వరకు తమ సమస్యలపై అర్జీలు సమర్పించేందుకు వచ్చారు. అర్జీలు తీసుకునే కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో చాలా మంది వెనుదిరిగారు. మిగిలిన వారిలో కొద్దిమంది డీఏఓ నిర్మలాదేవిని కలిసి తమ సమస్యలపై అర్జీ సమర్పించారు. ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన షేక్ షాహినా, 2023 ఆగస్టు 23న జరిగిన లారీ ప్రమాదంలో తన భర్త ఖాజాపీర్ చనిపోగా, తాను, కుమార్తె గాయపడినట్లు తెలిపింది. డాక్టర్లు తనకు 85శాతం అంగవైకల్యం సర్టిఫికెట్ ఇచ్చినప్పటికీ, తనకు ఎలాంటి పెన్షన్ మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేసింది. రెండేళ్లుగా పలుమార్లు అర్జీలు ఇస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, పీహెచ్‌సీ పెన్షన్ మంజూరుచేయాల్సిందిగా అర్జీ సమర్పించింది. మదనపల్లె మండలం దాదినాయునితండాకు చెందిన బాణావత్ మునెమ్మ... తన పేరు మీద ఉన్నటువంటి 3 ఎకరాల వ్యవసాయ పొలానికి సంబంధించి రైతుభరోసా, పీఎం కిసాన్ నగదు రావడం లేదని అర్జీ సమర్పించింది. సచివాలయంలో ఈ విషయమై అడిగితే, తన కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నట్లు చెప్పారని, అయితే తనకు నలుగురు ఆడపిల్లలని, వారిలో ఇద్దరికి వివాహం కాగా, ఇద్దరు చదువుకుంటున్నారని చెప్పింది. వారికి విద్యాదీవెన డబ్బులు పడలేదని, తమ కుటుంబంలో ఎవరూ ఉద్యోగులు లేరని, తమకు న్యాయం చేయాల్సిందిగా కోరింది. 25 ఏళ్లుగా తమ అనుభవంలోని వ్యవసాయభూమికి సంబంధించి సబ్ కలెక్టరేట్‌లోని రెవెన్యూకోర్టులో జరిగిన కేసుకు సంబంధించి తనకు అనుకూలంగా వచ్చిన జడ్జిమెంట్ తీర్పు కాపీని మంజూరుచేయాలని మండలంలోని ఈశ్వరమ్మకాలనీకి చెందిన అన్నపూర్ణ అర్జీ సమర్పించింది. అలాగే కోటవారిపల్లె గ్రామరెవెన్యూలోని భూమికి సంబంధించి ఆర్‌ఓసీనెం. బీ1/4112/2014 కింద సబ్ కలెక్టర్ రెవెన్యూకోర్టులో వేసిన కేసులో 2019లో తుది తీర్పు చెప్పారని, అయితే ఇప్పటివరకు జడ్జిమెంట్ కాపీ ఇవ్వకపోవడంతో ఆన్‌లైన్‌లో 1బీ చేసుకోలేకపోతున్నామని అర్జీలో పేర్కొంది.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని పాత కాలేజీ మైదానంలో వినాయకచవితి సందర్భంగా గణేష్ యూత్ సభ్యులు భారీ వినాయకుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆరో రోజు స్థానికులు వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాత రిటైర్డు ఉపాధ్యాయుని అరుణకుమారి ఆర్థిక సహకారంతో భక్తులకు పెద్ద ఎత్తున అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. సుమారు 1700 మంది భక్తులు అన్నసంతర్పణలో పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి

విద్యార్థిని నవ్యదీపికకు సన్మానం



నవ్యదీపికకు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి

మదనపల్లె సిటీ: కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి ఎదగవచ్చునని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.బాలకృష్ణమూర్తి అన్నారు.సోమవారం కాలేజీలో కాలేజీ విద్యార్థిని చామంతుల నవ్యదీపిక ఎంబీబీఎస్ రిమ్స్ మెడికల్ కాలేజీలో ఫ్రీ సీటు సాధించిన సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. నవ్యదీపిక కాలేజీకి మంచి పేరు తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వ కాలేజీలో చదివి ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం గర్వించదగ్గ విషయమన్నారు.ఈ ఏడాది నుంచి కాలేజీలో మెడికల్ అగ్రికల్చర్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. బాటనీ అధ్యాపకురాలు శ్రీదేవి గైడెన్స్ ఇస్తూ మెడికల్ సీటు రావడానికి మార్గదర్శకమైందన్నారు. విద్యార్థినికి అధ్యాపకురాలు శ్రీదేవి రూ.10వేలు, చంద్రమోహన్ రూ.5 వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా నవ్యదీపికతోపాటు తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సాయిశంకర్‌రెడ్డి, సేగు రెడ్డప్పరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాహుదా వంక స్థలం ఆక్రమణకు యత్నాలు



బాహుదా వంక స్థలాన్ని ఆక్రమించేందుకు చదును చేసిన వైనం

మదనపల్లె రూరల్ : పట్టణ నడిబొడ్డున, ఆర్టీసీ బస్టాండుకు సమీపంలోని బాహుదా వంక స్థలాన్ని ఆక్రమించుకునేందుకు సోమవారం కొందరు ప్రయత్నించారు. ప్రధాన రహదారికి ఆనుకుని వంక స్థలాన్ని దర్జాగా చదునుచేయడంతో పాటు కూసాలు నాటి సొంతం చేసుకునేందుకు యత్నించారు. వంక స్థలాన్ని ఆక్రమిస్తున్నారంటూ స్థానికులు రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కోటిరూపాయలు విలువచేసే స్థలాన్ని బహిరంగంగా ఆక్రమించుకుంటుంటే అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి

– మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్టీడి హరికి సూచించారు. వాల్మీకిపురంలో మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కలికిరికి చెందిన పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్టీడి హరి తన అనుచరులతో కలిసి మాజీ ఎమ్మెల్యే చింతలను కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే దళితులకు ప్రత్యేక గుర్తింపు, సముచిత స్థానం లభించేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎస్సీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుని అవమానిస్తున్నారు తప్ప వారికి చేసిందేమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని, కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. మండల పార్టీ కార్యవర్గ సభ్యులు మేస్త్రీ రామ, ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు చింతపర్తి సహదేవ, ఎం.సహదేవ, సి.వెంకటగిరి, సి.హరి, గుండ్లూరు విజయ్, గుట్టపాళెం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు లేని వాహనాలకు జరిమానా

రామసముద్రం : మండల కేంద్రంలో రికార్డులు లేని వాహనాలకు ఎస్ఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో జరిమానాలు విధించారు. వాహనాలకు రికార్డులు, లైసెన్సులు పరిశీలించి వాహన నిబంధనలు ప్రకారం రికార్డు తప్పకుండా ఉండాలని యజమానులకు సూచించారు. రికార్డులు లేని 12 వాహనదారులకు జరిమానా విధించారు. ఆటోలు నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులు తరలించ రాదని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని తెలియజేశారు.

ఎన్‌సీసీతో భవిష్యత్ నిర్మాణం



మాట్లాడుతున్న ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ మోనిష్

ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ ఎన్‌వి.మోనిష్

కురబలకోట: ఎన్‌సీసీతో ఉపాధి, ఉద్యోగాలు లభించడంతో పాటు భవిష్యత్ నిర్మాణం జరుగుతుందని చిత్తూరు 35–ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎన్‌వి. మోనిష్ అన్నారు. అంగళ్లులోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో సోమవారం ఎన్‌సీసీ ఉపయోగాలు కేరీర్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ జీవితంలో క్రమశిక్షణ, నాయకత్వం, సేవా భావం అలవడితే జీవితం జీవనం అద్భుతంగా మారుతుందని క్రమబద్ధమైన జీవితం మనిషిని ఉన్నతంగా గుర్తింపు తెస్తుందన్నారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ఎన్‌సీసీ ఎంతగానో దోహదపడుతుందన్నారు. శారీరక దృఢత్వంతో రోగాలు దరి చేరవన్నారు. సైనిక దళాల్లో చేరడానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారన్నారు. ఏఓ లెఫ్టినెంట్ కల్నల్ లోకనాధన్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై నిరసన

– వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



రాహుల్‌గాంధీపై వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

మదనపల్లె రూరల్ : ప్రధాని నరేంద్రమోదీ తల్లిపై భారత జాతీయ కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. సోమవారం పట్టణంలోని అనిబిసెంట్ సర్కిల్‌లో బీజేపీ నాయకులు, రాహుల్ గాం. దీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహిళను కించపరిచిన రాహుల్‌గాంధీని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని రాహుల్‌గాంధీపై కేసు నమోదుచేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ...ప్రధాని మోదీ తల్లిపై రాహుల్‌గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలు అసభ్యకరంగా ఉన్నాయన్నారు. ప్రపంచంలో లేని వ్యక్తి గురించి దుర్భాషలు ఆడటం బాధాకరమన్నారు. ప్రజాస్వామ్య సమాజంలో మహిళలపై దూషణలను సహించకూడదని, తక్షణమే రాహుల్‌గాంధీపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకోవాలని వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పులిరెడ్డి నరేంద్రకుమార్‌రెడ్డి, యల్లంపల్లె ప్రశాంత్, పి.భగవాన్, బండి ఆనంద్, వోసూరి కిరణ్‌కుమార్, బి.రవి, బాలజ్యోతి, జే.కే. వర్మ, పూలనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పాట్లు

- ఎరువుల దుకాణాల వద్ద పడిగాపులు
- ధర పెంచేసిన డీలర్
- ఎరువులతో పాటు మందులు కూడా కొనాలని మెలిక



ఎరువుల దుకాణం వద్ద రైతుల పడిగాపులు

పీలేరు : రైతులు తమ పంటలు దక్కించుకోవడానికి అవసరమైన యూరియా తీవ్ర కొరత ఉండడంతో నానా పాట్లు పడుతున్నారు. గంటల తరబడి ఎరువుల దుకాణాల వద్ద పడిగాపులు గాస్తున్నారు. సోమవారం పీలేరు పట్టణంలోని శ్రీనివాస ఫర్టిలైజర్ దుకాణానికి యూరియా వచ్చిందని సమాచారం అందుకున్న రైతులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. పీలేరు తోపాటు చుట్టు పక్కల మండలాల నుంచి సైతం రైతులు యూరియాకోసం ఎగబడ్డారు. అయితే ఇదే అదునుగా భావించిన ఎరువుల దుకాణం డీలర్ యూరియా ధర పెంచేశాడు. యూరియా బస్తా ఎమ్మార్పీ ధర రూ. 266 కాగా రూ. 300కు విక్రయించాడు. దీనికి తోడు యూరియా ఇవ్వాలంటే ఇతర మందులు కూడా కొనాల్సిందేనని మెలిక పెట్టారు. దీంతో చేసేది లేక రైతులు తమకు అవసరం లేకపోయినా ఇతర మందులు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం రైతులకు కనీసం యూరియా కూడా అందుబాటులో ఉంచకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రైతు సంక్షేమం పట్టని కూటమి ప్రభుత్వం



యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే కూటమి ప్రభుత్వం తనకేమి పట్టనట్లు వ్యవహరిస్తోంది. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించింది.

– చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే

యూరియా కొరత కృత్రిమ సృష్టే



రాష్ట్రంలో యూరియా కొరత కూటమి ప్రభుత్వ కృత్రిమ సృష్టిగానే కన్పిస్తోంది. గత నెల రోజులుగా రైతులు యూరియా కోసం నానా తిప్పలు పడుతున్నా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

– పి. ద్వారకనాథరెడ్డి, గోరంట్లపల్లె

రైతులను ఆదుకోవాలి



పంటల సాగుకు ప్రధానమైన ఎరువు యూరియా ఇచ్చి రైతులను ఆదుకోవాలి. రైతులకు సరిపడా యూరియా ఎరువుల దుకాణంలో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– సురేంద్ర, వేపులబైలు